
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
5
జిల్లాల వార్తలు
శనివారం 7 సెప్టెంబరు 2024





మట్టి పాత్రలను తయారు చేస్తున్న బ్రహ్మం

వినాయకచవితి ఏర్పాట్లపై జగ్గారెడ్డి పరిశీలన



సంగారెడ్డి గంజీ మైదాన్ వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలోని వినాయక మంటపం ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి, సంఘం సభ్యులు





సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వద్ద వినాయక మంటపం ఏర్పాట్లను పరిశీలించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, చిత్రంలో కూన సంతోష్, అర్జున్‌లాల్, వెంకట్, నాని, మహేష్ తదితరులు, పాతబస్టాండ్ రామ మందిరంలో వినాయక మంటపం ఏర్పాటును పరిశీలించిన జగ్గారెడ్డి, రామమందిర్ యువసేన సభ్యులు

కుమ్మరి కళాకారులపై కటాక్షమేది?

మట్టి ప్రతిమల తయారీదారులకు బకాయిలు

మెదక్ కల్చరల్, సెప్టెంబర్ 6 : మట్టి విగ్రహాలు తయారుచేసే కుమ్మరి వృత్తి సంఘం కళాకారులను అధికారులు కటాక్షించడం లేదు. పర్యావరణ హితం కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ప్రోత్సహించాలని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు పంపిణీ చేసేందుకు మెదక్ జిల్లా కుమ్మరి వృత్తి సంఘానికి ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చారు. 2022లో 8,290 విగ్రహాలు, 2023లో 3,600 విగ్రహాలను ఈ సంఘం తరఫున అందించారు. 15 కుటుంబాలకు చెందిన కుమ్మరి కళాకారులకు రెండేళ్లకు సంబంధించిన రూ.2.50 లక్షలను చెల్లించడం లేదు. బకాయిలు తీర్చాలని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

బకాయిలు చెల్లించండి

జిల్లా పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో మట్టి గణపతులు తయారు చేశాం. 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.2.50 లక్షలను ఇప్పటివరకు చెల్లించడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకున్న పాపనపోలేదు. బకాయిలు చెల్లించాలని వేడుకుంటున్నాం.

– బ్రహ్మం, మెదక్ జిల్లా కుమ్మరి వృత్తి సంఘం అధ్యక్షుడు

భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే కష్టాలు తొలుగుతాయి

భాద్రపద మాసంలో శుద్ధ చవితి రోజున వినాయకుడు జన్మించాడు. ఈరోజును వినాయక చతుర్థిగా నిర్వహించుకుంటాం. విఘ్నాలు తొలగించే వినాయకుడికి మొట్టమొదటి పూజను చేస్తారు. చవితి రోజున భక్తిశ్రద్ధలతో గణపతిని ఆరాధిస్తే ఎలాంటి కష్టాలైనా తొలగిపోతాయి. ఇళ్లల్లో మట్టి ప్రతిమను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు నియమనిష్ఠలతో ఉదయం, సాయంత్రం పూజలు చేయాలి. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేయాలి.

– బాష్యం మధుసూదనా చార్యులు, రామాలయం ప్రధాన పూజారి, మెదక్

వక్రతుండ మహాకాయ



- గణపయ్య పూజకు ఘనమైన ఏర్పాట్లు
- మెదక్, సంగారెడ్డి జిల్లాలో ముస్తాబైన మండపాలు
- విగ్రహాల విక్రయాలతో సందడిగా మార్కెట్లు
- కొండెక్కిన చింతకాయ, పూల ధరలు

సంగారెడ్డి రూరల్/మెదక్ కల్చరల్, సెప్టెంబరు 6 : వినాయక చవితి పండగను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వాసులు సిద్ధమయ్యారు. విగ్రహాల ప్రతిష్ఠకు మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరుపుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పూజ, అలంకరణ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి నెలకొంది. వివిధ రూపాల్లో తయారు చేసిన గణేష్ విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. పలు చోట్ల నాయకులు మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

సంగారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాల్లోని ప్రధాన మార్కెట్‌లో ఎక్కడ చూసినా వినాయక విగ్రహాల అమ్మకాల హడావిడి నెలకొన్నది. వివిధ రూపాల్లోని లంబోదరుడి విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. జిల్లా కేంద్రాలైన సంగారెడ్డి, మెదక్ పట్టణాలతో పాటు నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్, సదాశివపేట, నారాయణఖేడ్, జహీరాబాద్, బొల్లారం, పటాన్‌చెరు మార్కెట్లలో శుక్రవారం సందడి నెలకొన్నది. వినాయకుడికి ప్రీతిపాత్రమైన తుమ్మి ఆకులు, చింతకాయలు, మారేడుకాయలు, తామర ఆకులు, వివిధ రకాల పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి ప్రజలు రావడంతో మార్కెట్లు కిటకిటలాడాయి. సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, పోతిరెడ్డిపల్లి చౌరస్తా, రోడ్డుకిరువైపులా పూలు, పత్రి, వినాయక విగ్రహాలను విక్రయించేందుకు చిరువ్యాపారులు తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. మరోవైపు పూలు, చింతకాయ, తుమ్మికూర ధరలు ఆకాశన్నంటాయి. రెండింతలు చేసి విక్రయిస్తున్నారు. మామూలు రోజుల్లో బంతి పూల ధరలు కిలో రూ.40 నుంచి రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. చామంతి పూలు కిలో రూ.120 ఉండగా ప్రస్తుతం రూ.300 కిలో అమ్ముతున్నారు. చింతకాయ మాములు రోజుల్లో కిలో రూ.50 ఉండగా ప్రస్తుతం రూ.250 వరకు పలుకుతున్నది.



సంగారెడ్డిలో విగ్రహాన్ని కొనుగోలు చేస్తున్న మహిళలు



పూలు, పత్రి, చింతకాయ, తుమ్మికూర విక్రయిస్తున్న వ్యాపారులు

యోగా వినాయక



యోగ విద్యలోని నౌళి క్రియతో వినాయకుడి రూపాన్ని జీవన మంత్ర యోగ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అల్లా నరేష్ గురువారం శరీరంపై ఆవిష్కరించారు.

– చేగుంట

ప్రతీ మండపాన్ని పోలీసులు సందర్శించాలి

వీడియోకాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 6 : వినాయక మండపాల వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేస్తున్నామని, ప్రతీ మండపాన్ని పోలీసులు సందర్శించాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి శుక్రవారం అధికారులతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఎస్‌హెచ్‌వో వినాయక మండపాన్ని ప్రత్యక్షంగా సందర్శించాలని ఆదేశించారు. భద్రత దృష్ట్యా ప్రతీ మడపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. మండప ఏర్పాట్లకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ ద్వారా అనుమతి తీసుకోవాలని సూచించారు. మైకులు, లౌడ్‌స్పీకర్లు తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించేలా చూడాలన్నారు. నిమజ్జనం రోజు చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు.



పత్రంపై లంబోదరుడు

నారాయణఖేడ్‌కు చెందిన పత్ర చిత్రకారుడు గుండు శివకుమార్ రావి ఆకుపై వినాయకుడి చిత్రాలను మలచారు. పలు రూపాల్లో ఆయన మలిచిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి.

– నారాయణఖేడ్

హైవే విస్తరణ.. ఇదేం తీరు!



హైవే విస్తరణలో కూల్చేందుకు గుర్తించిన భవనాలు

- ఒకవైపే 15 ఫీట్లు అదనంగా హద్దులు
- వ్యాపారుల భవనాలకు ఎసరు
- కలెక్టర్, ఎంపీని ఆశ్రయించిన బాధితులు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 6 : సంగారెడ్డి జిల్లాలోని 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులను అడ్డదిడ్డంగా చేస్తున్నారని పలువురు వ్యాపారులు మండిపడుతున్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు చేసిన తప్పిదం కారణంగా అనేక మంది వ్యాపారుల భవనాలకు ఎసరు వచ్చింది. ప్రస్తుతం నాలుగు లేన్ల రహదారిగా ఉన్న ఈ హైవేను ఆరు లేన్లుగా విస్తరిస్తున్న విషయం తెలిసిందే. దీని కోసం ఎన్‌హెచ్‌ఏ అధికారులు గతంలోనే సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించారు.

200 ఫీట్ల రోడ్డుగా విస్తరణ

65వ నంబర్ జాతీయ రహదారిని ఆరు లేన్లగా విస్తరించేందుకు 200 ఫీట్లను గుర్తించి హద్దులు నిర్ధేశించారు. ఈ రోడ్డు డివైడర్ నుంచి ఉత్తర భాగం 100 ఫీట్లు, దక్షిణ భాగంగా 100 ఫీట్లుగా నిర్ణయించారు. జాతీయ రహదారి పనులు జీహెచ్ఎంసీ పరిధిలోని లింగంపల్లి నుంచి సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి వరకు సాగుతున్నాయి. రహదారి నాలుగులేన్ల రోడ్డుగా 2006లో ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్ వారు పనులు పూర్తి చేశారు. అప్పట్లోనే ఈ రహదారి కోసం 200 ఫీట్లను సేకరించారు. ప్రస్తుతం ఇదే రోడ్డుని ఆరు లేన్లుగా విస్తరిస్తున్నారు.

పోతిరెడ్డిపల్లి ఫ్లైఓవర్ నుంచి..

సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుంచి కంది సమీపంలోని జామ్ జామ్ దాబా వరకు రెండు కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరణ పనులు వివాదాస్పదంగా మారాయి. 2006లో నిర్ధారించిన 200 ఫీట్లలోనే ఈ రోడ్డును విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. అయితే, పోతిరెడ్డిపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి కంది సమీపంలోని జామ్ జామ్ దాబా వరకు రెండు కిలో మీటర్ల మేర దక్షిణ భాగం వైపు 15 ఫీట్లను అదనంగా విస్తరిస్తున్నట్టు బాధితులు తెలిపారు. ఉత్తరం వైపులో పోలీస్‌స్టేషన్ ప్రహరీ నుంచి 85 ఫీట్లు, దక్షిణం దిక్కున 115 ఫీట్లు సర్వేలో ద్వారా సేకరించారు. దీంతో దక్షిణం వైపు నిర్మించిన దాదాపు వంద భవనాలను కూల్చివేయాల్సి ఉంటుంది. రోడ్డు డివైడర్ నుంచి రెండు వైపుల వంద ఫీట్ల చొప్పున రోడ్డుని విస్తరించాలని భవన యజమానులు, షాపుల వారు డిమాండ్ చేస్తున్నారు. తప్పుడు సర్వేల వల్ల భవనాలను కోల్పోతున్న పలువురు బాధితులు తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్ క్రాంతి, ఎంపీ రఘునందన్‌రావును ఆశ్రయించారు. ఒకేవైపు 15 ఫీట్లు అదనంగా తీసుకుంటే తమకు అపార నష్టం జరుగుతుందని విన్నవించారు. 2006లో గుర్తించిన విధంగా రోడ్డుకిరువైపులా 200 ఫీట్లతోనే ఆరు లేన్లుగా రోడ్డుగా విస్తంరించాలని కోరారు.

మంజీర పరవళ్లు

- వనదుర్గ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద
- దుర్గామాత ఆలయం ఎదుటి నుంచి పరుగులు

పాపన్నపేట, సెప్టెంబర్ 6 : సింగూరు ప్రాజెక్టు నుంచి గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో వనదుర్గా ప్రాజెక్టుకు (ఘనపురం ఆనకట్టకు) వరద పోటెత్తింది. 29,410 క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తుంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఆనకట్ట పాయల వైపు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద శుక్రవారం వరద ప్రవాహం మరింత పెరిగింది. ఆలయం ఎదుట నుంచి మంజీరా పరుగులు పెడుతుంది. ఆరు రోజులుగా ఆలయం వద్ద వరద ఉండడంతో అర్చకులు అమ్మవారికి పూజలు చేసి అనంతరం ఆలయాన్ని మూసివేస్తున్న సంగతి తెలిసిందే. శుక్రవారం వరద ఉధృతి ఎక్కువ ఉండడంతో అర్చకులు సైతం వెళ్లలేదు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగుతున్నాయి.



ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయం ఎదుట మంజీర ప్రవాహం



ఘనపురం కట్టపై నుంచి పొంగుతున్న మంజీర

సమర్థవంతంగా 'ఫ్రైడే డ్రైడే'

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి/కొల్చారం, సెప్టెంబరు 6: జిల్లాలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం కొల్చారం మండలంలోని పైతరా గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్యతో కలిసి సందర్శించారు. పలు ఇళ్ల ఎదుట నీటి ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ వ్యక్తిగత పరిశుభ్రతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలను రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖ్య పంచాయతీ శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు.

మెదక్‌ను అగ్రగామిగా నిలపాలి

అధికారులు సమన్వయంతో పని చేయాలి

ప్రజాస్వామ్యానికి అర్థం తెలియని వాళ్లు మోదీపై విమర్శలా

దిశ కమిటీ చైర్మన్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు

7



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

అందుబాటులోకి ప్లేట్‌లెట్స్ యంత్రం

- జీజీహెచ్‌లో రూ.25 లక్షలతో ఏర్పాటు
- తెల్లరక్తకణాలు పడిపోయిన వారికి ప్రయోజనం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6 : డెంగ్యూ సోకి ప్లేట్‌లెట్స్(తెల్లరక్తకణాలు)పడిపోయాయని, వాటిని ఎక్కించకపోతే ప్రాణానికే ప్రమాదమని ఈ మధ్య చాలా మంది వైద్యులు చెబుతున్నమాట. ప్లేట్‌లెట్స్ అవసరమైన వారికి ప్రైవేటులో కొనుగోలు చేసి ఎక్కించాలంటే ఖర్చుతో కూడుకున్న పని. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రూ.25 లక్షల విలువైన 'సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్(ఎస్‌డీపీ) యంత్రాన్ని ఆర్నెళ్ల క్రితమే మంజూరు చేయగా, తాజాగా శుక్రవారం నుంచి ఆ యంత్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈమేరకు ఆస్పత్రి అధికారులు జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ వద్ద తెల్లరక్తకణాల తీయబడునంటూ బ్యానర్‌ను కూడా ఏర్పాటు చేశారు.

ప్రైవేటులో అధిక ధర..

సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ యంత్రం ద్వారా దాత నుంచి సేకరించిన రక్తం నుంచి ప్లేట్‌లెట్ రక్తాన్ని వేరుగా సేకరిస్తుంది. డెంగ్యూ జ్వరం, మహిళలు ప్రసవం సమయంలో, యాక్సిడెంట్, బ్రెయిన్ సర్జరీ, వైరల్ ఫీవర్లతో బాధపడుతూ తెల్లరక్తకణాలు అవసరమైన వారికి ఈ ప్లేట్‌లెట్ రక్తాన్ని వినియోగిస్తారు. సాధారణంగా ప్లేట్‌లెట్స్ రక్తం కోసం ప్రైవేటులో రూ.15 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. అందులో ప్రధానంగా ప్లేట్‌లెట్స్ వేరుచేసేందుకు ఉపయోగించే కిట్ సుమారు రూ.9 వేలు ఉంటుంది.



జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌లోని ఎస్‌డీపీ యంత్రం

ఆస్పత్రిలో అడ్మిట్ అయిన వారికి ఉచితం



సీజనల్ వ్యాధుల కాలంలో తెల్లరక్తకణాలు పడిపోవడం ఎక్కువగా జరుగుతుంది. జీజీహెచ్‌లో అడ్మిటై అవసరమైన రోగికి ప్లేట్‌లెట్స్(తెల్లరక్తకణాలు) ఉచితంగా అందిస్తాం. ప్రైవేటు ఆస్పత్రులు, బయటి వ్యక్తులకు ఇచ్చే ఆస్కారం లేదు. ఈ ఆస్పత్రికి తెల్లరక్తకణాలు తయారుచేసే సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ యంత్రం ప్రభుత్వం మంజూరు చేయడం శుభపరిణామం. తెల్లరక్తకణాలు పడిపోయిన వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రొ.అనిల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్, సంగారెడ్డి

పంచాయతీ ఎన్నికల సన్నద్ధానికి సర్వర్ కష్టాలు

- ముసాయిదా ఓటర్ల జాబితా 13వ తేదీకి వాయిదా
- 28న తుది జాబితా ప్రకటన
- మూడు విడతలుగా పోలింగ్ నిర్వహణ

మెదక్, సెప్టెంబరు 6 : పంచాయతీల ఎన్నికలకు అధికారులు వడివడిగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించాల్సి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆన్‌లైన్ ఇబ్బందులు తరచూ ఎదురవుతుండడంతో సర్వర్ డౌన్ అయింది. దీంతో మొదట ప్రకటించిన షెడ్యూల్ తేదీలను మార్చారు. సాంకేతిక సమస్యలు తలెత్తుడడంతో జాబితాలను కంప్యూటర్లలో నమోదు చేయడం ఆలస్యమవుతోందని, పంచాయతీ అధికారులు చెబుతున్నారు. ఎన్నికల అధికారి నిర్వహణ ప్రక్రియ తేదీలను మార్చినట్లు రాష్ట్ర ఎన్నికల కార్యాలయం సర్క్యులర్‌ను విడుదల చేసింది. పంచాయతీలలో ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శనను ఈనెల 13వ తేదీకి మార్చారు. మండల, జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు 13నే నిర్వహించాల్సి ఉండగా 18వ తేదీకి మార్చారు. ముసాయిదా జాబితాలో తప్పులుంటే అభ్యంతరాలను 14 నుంచి 21 వరకు స్వీకరించనున్నారు. సవరణల అనంతరం 28న తుది జాబితాను ప్రచురించనున్నారు.

ఒక్కో విడతలో ఆరు మండలాల్లో

జిల్లాలో మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు ప్రతిపాదించారు. మొదటి విడతలో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పాపన్నపేట, పెద్దశంకరంపేట, హవేళీఘనపూర్, మండలాల్లో నిర్వహిస్తారు. రెండో విడతలో కొల్చారం, శివంపేట, నర్సాపూర్, చిలప్‌చెడ్, కౌడిపల్లి, వెల్దుర్తి మండలాలు, మూడో విడతలో మెదక్, రామాయంపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, చేగుంట, మనోహరాబాద్, తూప్రాన్, నార్సింగి మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే 2,846 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. 650 ఓటర్లకు ఒక్కో పోలింగ్‌స్టేషన్ చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లా స్థాయి బేస్‌బాల్ సెలక్షన్స్

గజ్వేల్, సెప్టెంబరు 6: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్‌లో శుక్రవారం బేస్‌బాల్ జిల్లా జట్టు ఎంపికను నిర్వహించారు. బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సెంటూరు రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలో 47మంది బాలికలు, 75మంది బాలురు పాల్గొనగా, 18మంది బాలికలు, 18మంది బాలురను ఎంపిక చేసినట్లు రంగారెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పాల్గొంటారని తెలిపారు. ఆయన వెంట బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుయాదవ్, కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ కాటరాయప్ప, విజయపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, పీఈటీలు వెంకటేశ్వర్లు, విజయరేఖ, రాజశేఖర్, మమత, విఠల్, విజయ్, మహేశ్ పాల్గొన్నారు.


విద్యార్థులతో బేస్‌బాల్ కమిటీ సభ్యులు

తండాల తండ్లాట..!

అధ్వానంగా రోడ్లు.. వర్షం వస్తే రాకపోకలకు అంతరాయం

కంది, సెప్టెంబరు 6 : గిరిజన తండాలకు సరైన రోడ్లు లేక జనం నానా కష్టాలు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని వెంకట్రావు మక్తా తండా, తునికిల తండా పంచాయతీ పరిధిలోని గొల్లగూడ తండాలకు ఇప్పటికీ సరైన రోడ్లు లేవు. దాదాపు 400 మంది నివసిస్తున్న ఈ రెండు తండాల్లోని ప్రజలు ఎక్కువగా వ్యవసాయం, పశువులు మేకల పెంపకం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆయా గ్రామపంచాయతీల పరిధిలో ఉన్నప్పటికీ ఆ తండాలకు కనీసం తారు రోడ్డు గతి లేదు. రాకపోకలకు వారి సొంత వాహనాలు లేదా కాలినడకనే సాగిస్తున్నారు. అయితే, మట్టి రోడ్లపై వర్షం కురిసినప్పుడు రోడ్లు మొత్తం బురదతో చిత్తడిగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నది. చిరుజల్లు పడినా చాలు వెంకట్రావు మక్తతాండ, గొల్లగూడ తాండలలో నివసిస్తున్న ప్రజల వెన్నుపూసల్లో వణుకు పుడుతోంది. కారణం ఆ గ్రామాల్లో దాదాపు కిలోమీటర్ మేర ఉన్న మట్టి రోడ్డే. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డంతా బురద మయంగా మారి రాళ్లు తేలి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నది. గొల్లగూడెం నుంచి తునికిల తండా వరకు దారి మొత్తం గుంతల మయంగా మారుతుంది. ఆ తండాల్లో ఎవరికైనా జ్వరం వచ్చినా, తలనొప్పి, కడుపునొప్పులు వచ్చిన కూడా రాకపోకలు సాఫీగా లేక తాండాలోనే మగ్గాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇక పోతే ఆ తండాల్లో పాఠశాలలు లేక దగ్గరలోని గ్రామాలకు విద్యార్థులు చదువుకోవడానికి వెళ్తున్నారు. వారు కూడా బురదతో నిండిన రోడ్లపైనే నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది.


గుంతల మయంగా మారిన గొల్లగూడ తాండ రోడ్డు. (ఇన్‌సెట్లో) రాళ్లు తేలి గుంతల మయంగా కంది పరిధిలోని వెంకట్రావు మక్తా తాండ రోడ్డు

వెంటనే రోడ్లు వేయించాలి..



మా తండాకి వెంటనే రోడ్డు వేయించాలి. ఇప్పుడున్న గుంతలన్నీ మరమ్మతులు చేస్తే తాండావాసులకు రాకపోకలు మెరుగవుతాయి. వర్షం పడినప్పుడు ఈ రోడ్లపై వాహనాలు వెళ్లాలన్నా కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మా తాండ రోడ్డును బాగు చేయించాలి

- బానోత్ కుమార్ గొల్లగూడ తాండ

గుంతల రోడ్లతో ఇబ్బంది పడుతున్నాం..



చిన్నపాటి వర్షానికి తండాకు వచ్చే రోడ్డు మొత్తం రాళ్లు తేలి గుంతలమయంగా మారుతుంది. వాన నీరు ఆ గుంతల్లో నిలిచి మా రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తుంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మా తాండకు తారు రోడ్డు వేయించాలి.

- ఇస్లావత్ రమేష్, వెంకట్రావు మాక్తా తండా

శిథిలావస్థకు ములుగు పీహెచ్‌సీ

- వర్షం పడితే నీరు కారుతున్న స్లాబ్
- ప్రహరీలేక లోపలికి వస్తున్న పశువులు

ములుగు, సెప్టెంబరు 6: పేదలకు వైద్యం అందజేయాల్సిన ఆస్పత్రికి జబ్బు చేసింది. భవనం శిథిలావస్థకు చేరి కూలిపోయే దుస్థితిలో ఉన్నది. భారీ వర్షం కురిస్తే కూలిపోతుందా అన్నట్లుగా తయారైంది. దీంతో వైద్యం కోసం వచ్చే రోగులు భయాందోళనకు గురవుతుండగా, వైద్యులు, సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ములుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీకి రెండున్నర దశాబ్దాల క్రితం సొంత భవనం మంజూరు చేయగా నిర్మాణం పూర్తయింది. మండలంతోపాటు, పరిసర గ్రామాల ప్రజలకు ములుగు పీహెచ్‌సీలో వైద్యం అందజేస్తున్నారు. పీహెచ్‌సీకి భవనం ఉన్నప్పటికీ నుంచి నేటి వరకు మరమ్మతుల కోసం ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. ఫలితంగా ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. భవనం గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. స్లాబు దెబ్బతినడంతో వర్షం వచ్చినప్పుడల్లా నీరు కారుతున్నది. ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు ప్రహరీ కూడా సక్రమంగా లేదు. ఉన్న ఒక్క గేటు ఏనాడో విరిగిపోవడంతో పక్కకు పడేశారు. దీంతో పశువులు ఆస్పత్రిలో సంచరిస్తున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. ఆస్పత్రిలో రోగులకు, ఆస్పత్రి అవసరాలకు వినియోగించడానికి ఏర్పాటు చేసిన నీటి సంపు శిథిలావస్థకు చేరుకుంది. సంపుకు స్లాబులు లేకపోవడంతో పాత రేకులు ఏర్పాటు చేశారు. శిథిలావస్థకు చేరుకున్న పీహెచ్‌సీకి కొత్త భవనం నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అప్పటి వరకు పీహెచ్‌సీ భవనానికి మరమ్మతులు చేయాలని విన్నవిస్తున్నారు.




శిథిలావస్థకు చేరుకున్న చేరుకున్న ములుగు పీహెచ్‌సీ, అధ్వాన్నంగా తయారైన వాటర్ సంపు

నిధులు విడుదల చేయాలి



ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఆస్పత్రికి నిధులు మంజూరుచేసి మరమ్మతులు చేపట్టాలి. పీహెచ్‌సీలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.

- దీప్తి, ములుగు పీహెచ్‌సీ వైద్యాధికారి

అంబేడ్కర్ భవన్ నిర్మాణం పూర్తయ్యేనా..!

- హరీశ్ చొరవతో నిధులు
- మరో రూ. కోటి కోసం ప్రతిపాదనలు
- నిధులు లేక ఆగిన పనులు

చేర్యాల, సెప్టెంబరు 6 : చేర్యాల పట్టణంలో చేపట్టిన అంబేడ్కర్ భవన పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. భవనం పూర్తికి సరిపడా నిధులు మంజూరు కాకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. చేర్యాలను 2018లో మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన సమయంలో అంబేడ్కర్ భవనానికి రూ.50లక్షల వ్యయంతో ప్రతిపాదనలు పంపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని అమలుచేసిన సందర్భంగా రూ.50లక్షలు మంజూరు చేయడంతో స్థానిక అంబేడ్కర్‌నగర్ కాలనీలోని స్థలాన్ని కేటాయించారు. సంబంధిత ప్రదేశం మట్టిస్వభావం అనువుగా లేకపోవడంతో మంత్రి హరీశ్‌రావు చొరవ తీసుకుని అదనంగా రూ.80లక్షలు కలిపి మొత్తం రూ.1.30కోట్లు మంజూరు చేయించారు. ఆగస్టు 9, 2021న శంకుస్థాపన చేసి పనులు మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసినప్పటికీ ఏడాదిన్నర ఆలస్యంగా పనులు చేపట్టారు. కానీ గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుస్లాబ్ దశవరకు మాత్రమే ఆ నిధులు సరిపోవడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. దీంతో మరో రూ.1కోటి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించినప్పటికీ ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి. నిధులు మంజూరైతేనే పనులు ప్రారంభమై భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయచర్యల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈవిషయమై ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరుచేయించి పనులు పూర్తిచేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.


అంసపూర్తి దశలో అంబేడ్కర్ భవనం

మంజూరైన నిధుల వరకు పనులు చేపట్టాం

అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి రూ.1.30కోట్లు మంజూరయ్యాయి. ఆ నిధుల వరకు పనులు పూర్తయ్యాయి. అదనపు, పెండింగ్ పనులకు మరో రూ.1కోటి మంజూరుకోసం ప్రతిపాదనలు పంపించం, కానీ ప్రభుత్వం మారడంతో పాటు సమయం పట్టడంతో మళ్లీ అంచనా వేసి ప్రతిపాదనలు పంపించాల్సి ఉంటుంది.

- పంచాయత్‌రాజ్‌శాఖ డీఈ శ్రీనివాస్‌రెడ్డి

దానంపల్లి-నర్మెట్ట రోడ్డు నిర్మాణం చేపట్టాలి

చేర్యాల, సెప్టెంబరు 6: చేర్యాల మండలం దానంపల్లి, నంగునూరు మండలం నర్మెట్టకు వెళ్లే 3 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, నాయకులు మాదాసు మల్లేశం, బైటి రవీందర్, తాళ్ల సుధీర్, మంతపురి శ్రీకాంత్ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లో ఎంపీ కిరణ్‌కుమార్‌ను కలిసి రోడ్డు దుస్థితి వివరించారు. మట్టిరోడ్డు ఉండటంతో ప్రజలు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని, వెంటనే రోడ్డు నిర్మాణానికి చొరవ చూపాలని కోరారు. దీంతో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని పీఆర్ ఈఈని ఆదేశించారు.


వినతిపత్రం అందజేస్తున్ననాయకులు

నకిలీ విత్తనాలతో మోసపోయా..
న్యాయం చేయండి

● లేకుంటే పురుగుమందే దిక్కు అంటూ రైతు ఆవేదన


పురుగుల మందు డబ్బాతో రైతు కొమ్మరాజుల రమేష్

ధూళిమిట్ట, సెప్టెంబర్ 6: నకిలీ మొక్కజొన్న విత్తనాలతో మోసపోయా.. అధికారులు స్పందించి న్యాయం చేయాలంటూ మండలంలోని కూటిగల్ గ్రామానికి చెందిన రైతు కొమ్మరాజుల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం తన మొక్కజొన్న చేనులో వీడియోలో మాట్లాడుతూ గ్రామంలోని ఫర్టిలైజర్ షాపునకు వెళ్లి తనకు కావాల్సిన కంపెనీ మొక్కజొన్న విత్తనాలను అడిగితే ఇవ్వకుండా.. వాటికంటే మంచి దిగుబడి వస్తుందంటూ నమ్మించి వేరే కంపెనీకి చెందిన నకిలీ విత్తనాలను అంటగట్టడాని తెలిపారు. మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. ప్రస్తుతం చిన్న చిన్న కంకులు వచ్చాయని బోరుమన్నాడు. ఇప్పటికే వేసిన బోర్లు పడకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయిన తనను మరింత అప్పుల్లోకి నెట్టేశారని వాపోయాడు. మోసపోయిన తనను ఆదుకోవాలని, లేకుంటే ఆత్మహత్యే దిక్కు అంటూ పురుగుల మందు డబ్బాలు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశాడు.

28న జాతీయ లోక్ అదాలత్

● ఎక్కువ కేసులు పరిష్కరించండి
● జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 6 : రాజీయే రాజమార్గమన్న విషయాన్ని కక్షిదారులకు వివరించాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర అధికారులకు సూచించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం పోలీసు అధికారులు, ఎక్సైజ్ అధికారులతో ఈ నెల 28వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి భవానీచంద్ర మాట్లాడుతూ క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని కోరారు. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించి జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, న్యాయాధికారులు కె.జయంతి, సునీతా రవీంద్రారెడ్డి, రాధాకృష్ణ చౌహాన్, లక్ష్మణ్‌చారి, శాలిని, తేజశ్రీ, జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతులకు తీవ్ర నష్టం

●వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి


తూంకుంట గ్రామంలో రైతుల పంటపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ బిక్షపతి తదితరులు

జహీరాబాద్, సెప్టెంబరు 6 : నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులకు పెద్దమొత్తంలో నష్టం జరిగిందని వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి తెలిపారు. శుక్రవారం మండలంలోని తూంకుంట గ్రామంలో ఆయన పంటపొలాలను పరిశీలించారు. రోజువారీగా పంటనష్టం వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామన్నారు. పంటపొలాల్లో వరదనీరు అలాగే ఉందని, సాధ్యమైనంత తొందరగా తొలగించుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారిలావణ్య, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ. 2 లక్షల విరాళం


చెక్కును కార్పొరేటర్ సింధూ భర్త ఆదర్శరెడ్డికి అందిస్తున్న భూపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, సెప్టెంబరు 6 : రెండు తెలుగు రాష్ట్రాల వరద బాధితుల సహాయార్థం మాజీ ప్రొటెం చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి విరాళం అందజేశారు. ఒక్కో రాష్ట్రానికి రూ.లక్ష చొప్పున రూ.2 లక్షల విలువగల చెక్కులను జీహెచ్ఎంసీ 111 డివిజన్ కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డికి శుక్రవారం అందజేశారు కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్‌గౌడ్, జగన్నాథ్‌రెడ్డి, కృష్ణకాంత్, అజీమొద్దీన్, గౌస్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి

●నీలం మధు ముదిరాజ్


వరద నీరు తొలిగింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 6 : చిట్కుల్‌లోని కాలనీలు వరద ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. చిట్కుల్ గ్రామ పంచాయతీ పరిధిలో ముంపునకు గురైన పలు కాలనీలను శుక్రవారం ఉదయం ఎంపీవో హరిశంకర్ గౌడ్, ఈవో కవితతో కలిసి పరిశీలించారు. రోడ్లపై నిలిచిన నీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. నీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించి పంపితే ప్రభుత్వం నుంచి నిధులు రప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు.

పిడిగుపాటుకు ఎద్దు మృతి

కల్హేర్, సెప్టెంబరు 6 : సిర్గాపూర్ మండల పరిధిలోని ఉజలంపాడ్‌తండాలో పిడుగుపాటుకు ఎద్దు మృతిచెందింది. వివరాల్లోకి వెళితే తండాకు చెందిన రాథోడ్ నెహ్రూనాయక్ శుక్రవారం తన ఎద్దులతో వ్యవసాయ పనుల కోసం చేనుకు వెళ్లి వాటిని ఒకదగ్గర కట్టేశాడు. దీంతో పిడుగు పడి ఒక ఎద్దు మరణించగా సమీపంలో ఉన్న నెహ్రూనాయక్, ఆయన తండ్రి కిషన్ నాయక్‌లు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. సంఘటన స్థలాన్ని సిర్గాపూర్ తహసీల్దార్ ఉమాశంకర్ పరిశీలించి పంచనామా చేసి తమకు నివేదిక ఇవ్వాలని పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. నెహ్రూనాయక్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని ఉజలంపాడ్ మాజీ సర్పంచ్ శోభావతి శేరికార్, బీజేపీ జిల్లా నాయకుడు అరుణ్‌రాజ్ శేరికార్ కోరారు.




అడుగుగునా గుంతలే..


తారు ఆనవాళ్లు కనిపించనంతగా ధ్వంసమైన రోడ్డు

నరకదారులు

● 50 కిలో మీటర్ల అంతర్రాష్ట్ర రహదారి ఛిద్రం
● అడుగుకో గుంత.. బురదమయం..
● సిరూర్ వంతెన రెయిలింగ్ ధ్వంసం
● ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం
● తరచూ వాహన ప్రమాదాలు
● కన్నెత్తి చూడని ఆర్‌అండ్‌బీ శాఖ
● దశాబ్ద కాలంగా మరమ్మతులు శూన్యం

ఇది అందోలు నియోజకవర్గం పరిధి గుండా వెళ్తూ... కర్నాటక, మహారాష్ట్రలను కలిపే అంతర్రాష్ట్ర రహదారి. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అత్యంత ఆవశ్యమైన నిమ్జ్‌ను అనుసంధానించే రోడ్డు... అయితే ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అత్యంత దారుణంగా తయారైంది. మరమ్మతులు, నిర్వహణ లేకపోవడంతో సుమారు 50 కి.మీల దూరం ఎక్కడ చూసినా గుంతలు పడి, రాళ్లు తేలి కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గోతుల్లో నీరు చేరి చిత్తడిగా మారింది.

జోగిపేట, సెప్టెంబరు 6 : దశాబ్దాకాలంగా నిర్వహణ లేకపోవడంతో ఈ రోడ్డు అధ్వానంగా మారింది. వరుసగా కురిసిన భారీ వర్షాలకు ఈరహదారి పూర్తిగా ధ్వంసమైంది. మోకాలి లోతు గుంతలు పడడంతో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. అక్కడక్కడ చిత్తడిగా మారి ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఒళ్లు హూనం కావడంతోపాటు వాహనాలు సైతం పాడవుతున్నాయి. చిల్వెర చౌరస్తా నుంచి గట్టుపల్లి వరకు సుమారు 10 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. కిటోమీటర్‌కు కనీసం ఐదుకు తక్కువ కాకుండా ఈ పది కి .మీ లలో సుమారు 70వరకు గుంతలున్నాయి. ముఖ్యంగా చేవెళ్ల, మేడికుంద, దేవునూర్‌గేట్, పోతులబొగుడ గేట్, బహిరన్ దిబ్బ, వట్‌పల్లి వద్ద భారీ గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.

రోడ్డు ఆనవాళ్లు కనిపించనంతగా..

ముఖ్యంగా మంజీరా నదిపై గల గట్టుపల్లి-సిరూర్ బ్రిడ్జి ఆవల సిరూర్ వైపు నాలుగు కిలోమీటర్లు అత్యంత దారుణంగా మారింది. రాయికోడ్ మండలం సిరూర్ గ్రామ శివారులోని నుంచి రాయిపల్లి బ్రిడ్జి ఆవల గట్టు నుంచి మహబత్‌పూర్ శివారు వరకు నాలుగు కిలోమీటర్ల మేర తారు రోడ్డు అనే ఆనవాళ్లు లేకుండా పూర్తిగా ఛిద్రమైపోయింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి.


రోడ్డు గుంతలో నిలిచిన నీరు.

ఈరోడ్డుగుండా ప్రయాణించడానికి వాహనదారులు భయంతో వణికిపోతున్నారు. సుమారు మోకాలి లోతున్న గుంతల్లో లారీలు, బస్సులే దిగబడిపోతున్నాయంటే, కార్లు, ఆటోల పరిస్థితి ఊహించుకోవచ్చు. చిన్నిపాటి వర్షానికే సదరు మట్టి బురదగా మారి, బైకులు, కార్ల టైర్లు, స్లిప్ అయి కంట్రోల్ తప్పి పడిపోతున్నాయి.

తప్పని అదనపు ప్రయాణం

ఈ రోడ్డు బాగలేకపోవడంతో పలువురు లారీ, ఇతర వాహనాల డ్రైవర్లు ప్రత్యామ్నాయంగా చిల్వెర -జోగిపేట-సంగారెడ్డి-జహీరాబాద్ మీదుగా ప్రయాణించడంతో సుమారు 90 కి.మీల మేర అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నది.. ఇది పెరిగిన డీజిల్ ధరల వల్ల నష్టం వస్తుందని వాపోతున్నారు.


రహదారిపై పడిన గుంతలు



అధ్వానంగా ఎన్‌హెచ్ 65

కోహీర్, సెప్టెంబరు 6 : కోహీర్ మండలంలోని మద్రి గ్రామ శివారు నుంచి దిగ్వాల్ గ్రామం మీదుగా కవేలి, చింతలఘట్టు చౌరస్తా, కొత్తూరు(డి) గ్రామం మీదుగా ఉన్న 65వ జాతీయ రహదారి గుంతల మయంగా మారింది. అయినా నేషనల్ హైవే హథారిటీ (ఎన్‌హెచ్ఏ) ఏం మాత్రం పట్టించుకోవడంలేదు. ఈ దారిగుండా నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళతూ ఉంటాయి. ఈ నేపథ్యంతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై మునిపల్లి మండలం కంకోల్ గ్రామం వద్ద ఉన్న టోల్ గేట్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆదమరిస్తే నదిలో మునుగుడే..



ఈరహదారి మంజీరా నది పైనుంచి వెళ్తుండడంతో వట్‌పల్లి మండలం గట్టుపల్లి, రాయికోడ్ మండలం సిరూర్ గ్రామాల మధ్య మంజీరా నదిపై వంతెన నిర్మించారు. దీనికి ఒక పక్క రెయిలింగ్ విరిగిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంలేదు. ఏ మాత్రం డ్రైవర్లు ఆద మరించినా వాహనం అదుపు తప్పినా నేరుగా మంజీరా నదిలోకి పడిపోవడం గ్యారెంటీ. ఇలా పలు వాహనాలు నీటిలో పడిపోయిన ఘటనలూ లేకపోలేదు. అయితే అదృష్టవశాత్తూ ఇప్పటి వరకూ ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోయినప్పటికీ. ప్రమాదాల నివారణకు వెంటనే రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మెదక్‌ను అగ్రగామిగా నిలపాలి

అధికారులు సమన్వయంతో పని చేయాలి

దిశ కమిటీ చైర్మన్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు


మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు(ఇన్‌ఎట్‌లో), హాజరైన అధికారులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 6: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మెదక్ పార్లమెంట్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలని దిశ కమిటీ చైర్మన్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. దిశ కమిటీ చైర్మన్ హోదాలో ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. పూర్తయిన రెండు పడకల గదుల ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలన్నారు. డెంగ్యూ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీల్లో అవసరమైన చోట పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని సూచించారు. శానిటేషన్ విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. చర్చించిన అంశాలపై నివేదికలు తయారు చేసి, పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, డీఈవో రాధాకిషన్, ఏడీఏ గోవింద్, డీపీవో, ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యూఎస్ వివిధ శాఖల అధికారులు, మెదక్, తూప్రాన్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్లు చంద్రపాల్, మామిడ్ల జ్యోతి, అశోక్‌గౌడ్, డీసీహెచ్ఎస్ డా. శివదయాల్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం అసెంబ్లీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

పార్టీని బలోపేతం చేయాలి..

హత్నూర, సెప్టెంబరు 6: గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హత్నూర మండలం శేర్కాన్‌పల్లి గ్రామ శివారులో గల పలుగుమీది పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశమై సభ్యత్వ నమోదు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

ప్రజాస్వామ్యానికి అర్థం తెలియని వాళ్లు మోదీపై విమర్శలా..

మెదక్, సెప్టెంబరు 6: ఉక్రెయిన్- రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని నిలిపివేయడానికి మధ్య వర్తిత్వం వహించాలని రష్యా అధ్యక్షుడు స్వయంగా ప్రధాని మోదీని కోరుతున్నార, ప్రజాస్వామ్యానికి అర్థం తెలియని వ్యక్తులు మోదీని విమర్శించడం వారి విజ్ఞతకే వదిలి వేస్తున్నామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పరోక్షంగా సీఎం రేవంత్‌ను దెప్పిపొడిచారు. శుక్రవారం మెదక్‌లోని కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ... గురుకులాల్లో విద్యాబోధన చేస్తున్న 6200 మంది టీచర్లను విధుల నుంచి ఉత్తర్వులు జారీ చేయడం ప్రభుత్వ అనాలోచిత చర్య అన్నారు. దీని వల్ల ఆ కుటుంబాలన్నీ రోడ్డున పడ్డాయన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో ఉద్యోగాల నుంచి తొలగిస్తే వారికి ఉపాధి ఎలా లభిస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే వారిని విధుల్లోకి తీసుకోకపోతే బీజేపీ తరఫున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. మెదక్ పట్టణంలో మెడికల్ కళాశాల ఏర్పాటు విషయంలో జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మెడికల్ కౌన్సిల్‌కి నివేదిక అందిందని తెలిపారు. త్వరలోనే హెల్త్ సెక్రటరీని కలిసి మెడికల్ కళాశాల ఏర్పాటు అయ్యేలా చూస్తామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడు నెలల చిన్నారి మృతి

ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యంతోనేనంటూ ఆందోళన


చిన్నారి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి మంజుల

కల్హేర్, సెప్టెంబరు 6 : ప్రథమ చికిత్స కేంద్రంలో మూడు నెలల పసిపాప మరణించిన సంఘటన కల్హేర్ మండలంలోని క్రిష్ణాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఆర్‌ఎంపీ వైద్యుడు సక్రమంగా చికిత్స చేయకపోవడంతోనే తమ చిన్నారి చనిపోయిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు వైద్యుడితోపాటు ఆయన ఇంటిపై దాడికి యత్నించారు. వివరాల్లోకి వెళ్లితే మండల పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామానికి చెందిన బేగారి అనిల్, మంజుల దంపతుల కుమార్తె భానుప్రియ(3 నెలలు) నాలుగైదు రోజులుగా జలుబు, జ్వరం బారిన పడటంతో నిజామబాద్, కామారెడ్డి జిల్లా బాన్స్‌వాడలలో వైద్యం చేయించారు. జలుబును తగ్గించేందుకు నెబిలైజర్ పరికరం సాయంతో శుక్రవారం ఆర్‌ఎంపీ వైద్యుడు ఎండీ బాలికకు చికిత్స అందించిన కొద్దిసేపటికే చిన్నారి మరణించింది. పాప మృతికి ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల సదరు వైద్యుడుపై దాడికి యత్నించారు. రెండు రోజులుగా చికిత్స చేస్తున్నాడని, నయం కాదని తెలిపితే తాము ఇతర పెద్ద ఆసుపత్రికి తీసుకుపోయేవారమని బాధితులు తెలిపారు. చికిత్స చేయడంలో తన తప్పు లేదని, ఎలాంటి ఇంజక్షన్లు, గ్లూకోజులు ఇవ్వలేదని ఆర్‌ఎంపీ వైద్యుడు తెలిపారు. చివరకు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం వచ్చి బాధితులను సముదాయించారు.

డయల్ 100కు 14 సార్లు కాల్

● వ్యక్తిపై కేసు నమోదు

కల్హేర్, సెప్టెంబరు 6: తల్లి తనకు భూమి ఇవ్వడం లేదని మద్యం మత్తులో డయల్ 100కు 14సార్లు ఫోన్ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విసిగించడంతో పాటు న్యూసెన్స్ సృష్టించినందుకు అతనిపై కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి పోచాపూర్‌కు చెందిన దూదేకుల నహీం రెండు రోజులుగా సాయంత్రం పూట మద్యం తాగి, తల్లి తనకు భూమి రాసి ఇవ్వడం లేదని ఓ రోజు 6 సార్లు, మరో రోజు 8 సార్లు డయల్ 100కు కాల్ చేశాడు. దీంతో పోలీసులు అతడిని శుక్రవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి, కేసు నమోదు చేశారు. ఎవరైనా డయల్ 100కు అనవసరంగా కాల్ చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీని వల్ల అసలైన ఇబ్బందుల్లో ఉన్న వారికి నష్టం జరుగుతుందన్నారు.

రైల్వే సమాచారానికి వన్‌స్టాప్ కాంటాక్ట్ 139

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైల్వేలకు సంబంధించి అన్ని రకాల హెల్ప్‌లైన్‌లను ఏకీకృతం చేస్తూ 139 నంబరును వన్‌స్టాప్ కాంటాక్ట్‌గా ఏర్పాటు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. ఇకపై ప్రయాణికులు ఏదైనా సమాచారం, సహాయం కావాల్సి వస్తే నేరుగా 139 నంబరుకు ఫోన్ చేయవచ్చు. 139 హెల్ప్‌లైన్ ప్రస్తుతం 12భాషల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. రైళ్లకు సంబంధించిన ఏదేని సమాచారం/ఫిర్యాదు కోసం 139 నంబరుకు ఫోన్ చేసి ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్(ఐవీఆర్ఎస్) లేదా నేరుగా కాల్‌సెంటర్ ఉద్యోగితో నేరుగా సంప్రదించవచ్చు. ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలనుకునే రైల్‌మదద్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదులు పంపవచ్చు. ప్రయాణంలో భద్రతకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 139కు ఫోన్‌చేయవచ్చు. పీఎన్ఆర్ స్టేటస్ కోసం 1, రైలు షెడ్యూలు కోసం 2, సాధారణ ఫిర్యాదుల కోసం 3, టికెట్లు రద్దు, సొమ్మువాపసు వివరాల కోసం 4, దివ్యాంగులకు సంబంధించిన సమాచారం కోసం 5, విజిలెన్స్ సంబంధిత ఫిర్యాదుల కోసం 6 నొక్కాలి. రైల్వేల పనితీరుకు సంబంధించి నాణ్యతలేని సమాచారాన్ని సోషల్‌మీడియాలో రీల్స్, వీడియోలను ప్రసారం చేయడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని అధికారులు వెల్లడించారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


అల్లాదుర్గం శివారులో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అల్లాదుర్గం, సెప్టెంబరు 6 : వర్షంతో దెబ్బతిన్న పంటలను అల్లాదుర్గం వ్యవసాయశాఖ అధికారి రాజేష్ కుమార్ శుక్రవారం ఏఈవోలతో కలసి పరిశీలించారు. ఈ నెల 6న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కడగండ్లు అన్న కథనంపై స్పందించిన అధికారులు నష్టం వాటిల్లిన పంటను పరిశీలించారు. వర్షం తాకిడి నుంచి పంటలను రక్షించుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఆయన వెంట ఏఈవో అమృత్ ఉన్నారు.

ఐఐటీహెచ్‌లో స్ట్రాటజిక్ ఏఐ ప్రోగ్రామ్

వారానికి 16 గంటలకు క్లాసులు

కంది, సెప్టెంబరు 6: సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ హైదరాబాద్‌లో వర్కింగ్ ప్రొఫెషనల్ కోసం ఐఐటీహెచ్‌లో స్ట్రాటజికల్ ఏఐ (కృత్రిమ మేధ) ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ వ్యూహాత్మక అప్లికేషన్‌ల సమగ్ర అవలోకనాన్ని అందించడానికి ఈ ప్రోగ్రామ్ రూపొందించారు. శని, ఆదివారాల్లో రోజుకు 8 గంటల చొప్పున రెండు రోజులకు 16 గంటల పాటు ఆన్‌లైన్ మోడ్‌లో క్లాసులు నిర్వహిస్తారు. ఇందుకు ఫీజు జీఎస్టీతో కలిపి రూ.10వేలు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వ తేదీ వరకు గడువు ఇచ్చారు. సెప్టెంబరు 15 నుంచి క్లాసులు ప్రారంభమవుతాయి. వివరాలకు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఐఐటీహెచ్ అధికారులు తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చేర్యాల, సెప్టెంబరు 6 : మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన బుచ్చెల్లి కుమార్(45) కొన్నాళ్లుగా మద్యానికి అలావాటు పడి కుటుంబాన్ని పోషించకపోగా, తాగడానికి డబ్బులు కావాలని గొడవపడుతున్నాడు. గురువారం రాత్రి కూడా అతిగా మద్యం తాగివచ్చి భార్య, కూతురితో గొడవపడ్డాడు. అనంతరం వారిద్దరిని ఇంట్లో నుంచి గెంటివేసి తలుపునకు గడియ పెట్టుకుని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు గౌడ్ తెలిపారు.

285 మంది ఐసెట్ సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం ఆర్‌వో ఫారం అందజేస్తున్న పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ గోవర్ధన్

నంగునూరు,సెప్టెంబరు 6 :ఎంబీఏ,ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం కోసం ఐసెట్ లో అర్హత సాధించి స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు రాజగోపాల్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ లో శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎ.గోవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా 285మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సందర్భంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఐసెట్ వెరిఫికేషన్ 8, 9 తేదీల్లో కూడా కొనసాగుతుందన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


మంచోళ్ల రేనేష్(ఫైల్)

మనోహరాబాద్, సెప్టెంబరు 6: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పర్కిబండ గ్రామానికి చెందిన మంచోళ్ల రేనేష్(27) కొన్నేళ్ల క్రితం కాళ్లకల్ గ్రామంలో సొంత ఇల్లు కొనుక్కుని అత్తవారి ఊరైన కాళ్లకల్‌గా గ్రామంలోనే నివాసముంటున్నాడు. కొద్ది రోజులుగా ఫీట్స్ రావడంతో ఆరోగ్యం బాగాలేక మానసిక ఇబ్బందులతో ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో భార్య పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నది. ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న రేనేష్ ఆర్థిక ఇబ్బందులతో మరింత కుంగిపోయాడు. శుక్రవారం ఉదయం భార్య పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు భార్య తెలిపింది. మృతుడికి భార్య అనురాధతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రుస్తుంపేట చెరువులో వ్యక్తి గల్లంతు

నర్సాపూర్, సెప్టెంబరు 6: రుస్తుంపేటలోని చెరువులో గుండంఅశోక్(54) అనే వ్యక్తి శుక్రవారం గల్లంతు కాగా సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. స్థానికుల వివరాల ప్రకారం రుస్తుంపేటకు చెందిన గుండం అశోక్ మానసిక వికలాంగుడు. బర్రెలను మేపుతూ జీవిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం కూడా బర్రెలు కాసేందుకు వెళ్లాడు. వాటికి సమీపంలోని చెరువులో నీరు తాపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగిపోయాడు. ఇది గుర్తించిన పలువురు గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకుని పొద్దుపోయే వరకు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మరునాడు ఉదయం గాలించనున్నట్టు చెప్పారు.

బైక్‌ను కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు


ప్రమాదంలో గాయపడిన ప్రశాంత్

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 6: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని టీమాందాపూర్ గ్రామ శివారులోని మెదక్ చేగుంట రహదారిపై చోటు చేసుకున్నది. చందాపూర్ గ్రామానికి చెందిన అరిగే ప్రశాంత్, అత్తమ్మతో కలిసి బైక్‌పై మెదక్ మండలం పిల్లికోటాల్ కు బయలుదేరాడు.ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆలయం వద్ద వృద్ధుడి అదృశ్యం


లక్ష్మయ్య

గుమ్మడిదల, సెప్టెంబరు 6: ఆలయం వద్ద నిద్ర చేయాడానికి వచ్చిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. గుమ్మడిదల ఎస్‌ఐ మహేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బొల్లారం మున్సిపాలిటీకి చెందిన మైలారం విజయ్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం బొంతపల్లి వీరభద్రస్వామి దేవస్థానం వద్ద నిద్ర చేయడానికి వెళ్లారు. శుక్రవారం ఉదయం తన తండ్రి లక్ష్మయ్య(70) కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోయింది. కుమారుడు లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాళం వేసిన మూడిళ్లలో చోరీ

కౌడిపల్లి, సెప్టెంబరు 6: తాళం వేసి ఉన్న ఇళ్లలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని వెల్మకన్నెలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య చాకలి వెంకటయ్య మాణిక్యం వెంకటేశంగుప్తా ఇంట్లో రూ.3000 యూఎస్ డాలర్లను అపహరించారు. తాళాలు వేసి ఉండటం గమనించిన గుర్తుతెలియని దుండగులు అర్ధరాత్రి పక్క ఇంటి బయట గడియపెట్టి దొంగతనానికి పాల్పడం గమనార్హం. అరతులం బంగారం, 25 తులాల వెండి, 45 వేల నగదు అపహరించినట్టు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

చెట్ల తిమ్మాయిపల్లిలో అట్రాసిటీ కేసుపై విచారణ

మాసాయిపేట సెప్టెంబర్ 6: మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామంలో గత నెల 25న అదే గ్రామానికి చెందిన కొందరు నాయకులు ఆ గ్రామ దళితులపై దాడి చేసి కులం పేరుతో దూషించారనే ఆ గ్రామ. దళితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తూప్రాన్ డీఎస్పీ శుక్రవారం గ్రామంలో విచారణ నిర్వహించారు. విచారణలో సంఘటన జరిగిన తీరు,.దళితులపై దాడి విషయాలను డీఎస్పీ వెంకట్‌రెడ్డి బాధితులను, దళితులను అడిగి తెలుసుకున్నారు. విచారణ పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు.

'విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయం'

కొండాపూర్, సెప్టెంబరు 6: గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు చేయూతనివ్వడం అభినందనీయమని సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం తొగర్‌పల్లి ఉన్నత పాఠశాలల్లో 600 మంది విద్యార్థులకు సన్‌రైజ్ ఆసుపత్రి ప్రతినిధి స్వామిగౌడ్ రూ.3లక్షల విలువగల షూస్,సాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో భీమ్‌సింగ్, ప్రధానోపాధ్యాయులు దశరథ్, ఉపాధ్యాయులు, డాక్టర్లు మల్లిక, సంతోష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

శరణ్ కెమికల్‌ని సందర్శించిన గీతం విద్యార్థులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 6 : గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు హైదరాబాద్‌లోని ఒక బహుళజాతి ఫార్మాస్యూటికల్ కంపెనీ శరణ్ కెమికల్ టెక్నాలజీలో పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ), అనలిటికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఏఆర్అండ్‌డీ) సౌకర్యాలను సందర్శించారు. పరిశ్రమల గురించి, ఔషధ కార్యకలాపాలపై అవగాహనను ఏర్పరచడానికి గీతం ఈ పర్యటనను ఏర్పాటు చేసింది.

క్రీడల్లో గెలుపోటములు సహజం: డీఈవో

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 6: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని మెదక్ డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. నాలుగురోజుల క్రితం చిన్నశంకరంపేట హైస్కూల్ ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 విభాగంలో ప్రారంభమైన (ఎస్‌జీఎఫ్) క్రీడాపోటీలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వరకు కొనసాగాయి. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డీఈవో చేతుల మీదుగా బహుమతులను బహుమతులను అందజేశారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- ఉత్సవకమిటీలకు అవగాహన కల్పించిన అధికారులు
- పలుచోట్ల ఉచితంగా మట్టి ప్రతిమల పంపిణీ




నారాయణఖేడ్ మాట్లాడుతున్న ఆర్డీవో, రామచంద్రాపురంలో మట్టిప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, నర్సాపూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 6: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఖేడ్ ఆర్డీవో అశోకచక్రవర్తి సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో ఉత్సవకమిటీ నిర్వాహకులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వినాయక మండపాలను రాకపోకలకు ఆటంకం కల్గేలా రోడ్లపై ఏర్పాటు చేయరాదన్నారు. నిమజ్జనాల సమయంలో ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద, రాజేష్‌చౌహాన్, నర్సింహులు, విఠల్ పాల్గొన్నారు.

- జిన్నారం, సెప్టెంబరు 6: ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు, సీఐ గంగాధర్ పేర్కొన్నారు. శుక్రవారం బొల్లారంలో వినాయక ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణకు మున్సిపల్ ఆధ్వర్యంలో సహకారం అందిస్తామని కమిషనర్ తెలిపారు. కాగా నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పోలీస్ శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌వో నర్సింహులు, మెడికల్ ఆఫీసర్ నిర్మలారెడ్డి, కాజీపల్లి, మాదారం పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

- రామచంద్రాపురం: వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ 111 డివిజన్‌లో కార్పొరేటర్ వి.సింధూఆదర్శరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సురేష్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.
- నారాయణఖేడ్: పర్యావరణ హితం కోసం మట్టి వినాయక ప్రతిమలనే ప్రతిష్ఠించుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పురపాలకసంఘ పరిధిలోని మంగల్‌పేటలో పురపాలక ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురపాలక కమిషనరు జగ్జీవన్, చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.
- జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని రంజోల్, తదితర ప్రాంతాల్లోగల వినాయవిగ్రహాల కొనుగోళ్లతో సందడి వాతావరణం నెలకొన్నది. వినాయవిగ్రహాల ధరలు ఎక్కువగానే ఉన్నాయని కొనుగోలుదారులు పేర్కొంటుండగా, ముడిసరుకు తదితర ధరలు ఎక్కువగా ఉండడం మూలంగానే గిట్టుబాటుకు అమ్ముకోవాల్సి వస్తుందని విక్రయదారులు స్పష్టం చెబుతున్నారు. శుక్రవారం కొనుగోలు చేసిన భారీ విగ్రహాలను వాహనాల్లో మండపాలకు తరలిస్తుండటంతో వీధుల్లో పండుగ సందడి నెలకొన్నది.
- నర్సాపూర్: మట్టి వినాయక ప్రతిమలు పర్యావరణానికి ఎంతో శ్రేయస్కరమని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో మట్టివినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీధర్ గుప్తా, జె.వెంకటేశ్, మల్లేష్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.
- శివ్వంపేట: మండల పరిధిలోని చిన్నగొట్టి ముక్ల ప్రాథమిక పాఠశాలలో, దొంతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వినాయక మట్టి గణపతులను తయారు చేశారు. దీంతో పర్యావరణహితంపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు.
- వెల్దుర్తి: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడిని పూజించాలని మండల పరిధిలోని ఎలుకపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వీరేందర్, అశ్విని పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో మట్టి వినాయకులను విద్యార్థులతో కలిసి తయారు చేసి పూజలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని వారు సూచించారు.

మండలాల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



సంగారెడ్డి అర్బన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలోఉపాధ్యాయులకు సన్మానం, శివ్వంపేట ఎస్‌బీఐ బ్యాంక్‌లో గురుపూజోత్సవం

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని ఓ బంకెట్ హాల్‌లో రిటైర్డ్ ఉపాధ్యాయుడు పట్లోళ్ల శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపకార్థం అతడి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని 40 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ డిస్ట్రిక్ట్ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, క్లబ్ అధ్యక్షుడు జార్జ్ మ్యాథ్యూస్, రీజియన్ చైర్మన్ కరుణాకర్‌గౌడ్, జోన్ చైర్మన్ వెంకటేశం, కార్యదర్శి రామప్ప, కోశాధికారి కృష్ణ, అనంతయ్య, ప్రభాకర్, మల్లేశం, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

- సదాశివపేట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెట్ హెడ్‌మాస్టర్ ఆర్.రవీంద్రనాథ్, దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయురాలు అశ్వినిలను బ్యాంక్ మేనేజర్ కె.నాగేందర్ ఆధ్వర్యంలో బ్యాంక్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది ఎస్.వెంకటేశం, అనూష, కిరణ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.
- వెల్దుర్తి: మండల కేంద్రంలోని బాష్యం విద్యామందిర్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా గురుపూజ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. అంతకుముందు పాఠశాలలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. అనంతరం ఉపాధ్యాయులును సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు తేవడం చేతకాక ఎమ్మెల్యేపై విమర్శలా?

- నర్సాపూర్ బీఆర్ఎస్ నాయకులు


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్, సెప్టెంబరు 6: నర్సాపూర్ నియోజకవర్గంకు ప్రత్యేకంగా గత సీఎం కేసీఆర్ మంజూరు చేసిన ప్రత్యేక నిధులు ఈ ప్రభుత్వంలో రద్దు కాగా అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ అర్ధాంతరంగా నిలిచిపోతే వాటిని తీసుకు వచ్చే దమ్ము లేని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఎమ్మెల్యే సునీతారెడ్డిపై లేనిపోని విమర్శలు చేస్తే సహించేది లేదని మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీమొద్దీన్, మండలపార్టీ అధ్యక్షుడు శేఖర్, మాజీ జడ్పీటీసీ బబియానాయక్ విమర్శించారు. గురువారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే సునీతారెడ్డి స్వగృహంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నయీమొద్దీన్, మాజీ జడ్పీటీసీ బబియానాయక్, మండలపార్టీ అధ్యక్షుడు శేఖర్, సీనియర్ నాయకులు సత్యంగౌడ్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమార్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తదితరులు విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ చేతిలో ఓటమి చెందిన కాంగ్రెస్ నాయకులు ఏ పదవీ లేకున్నా ప్రొటోకాల్ కూడా పాటించకుండా, ఎమ్మెల్యే సునీతారెడ్డిపై అడ్డగోలుగా విమర్శలుచేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వ్యక్తిగత విమర్శలు మానుకుని నియోజకవర్గం అభివృద్ధి కోసం పనిచేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్,రాజేందర్‌నాయక్ సామ్య, ఉమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఇళ్ల స్థలాలకు పొజిషన్ చూపాలి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 6: కల్హేర్ మండలం మార్డిలోని సర్వేనంబర్ 10లో ఇళ్లులేని 74 మంది ఎస్సీలకు 1999లో అప్పటి ఎమ్మెల్యే కిష్టారెడ్డి ఎస్సీ మోడల్‌కాలనీ కోసం ఇళ్ల పట్టాలు అందజేసినా ఇప్పటి వరకు పొజిషన్ చూపలేదు. ఈ మేరకు తమ ఇళ్ల స్థలాల పొజిషన్ చూపాలని కోరుతూ బాధితులు శుక్రవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇళ్లు లేక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇందుకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ పట్టణానికి చెందిన నిజామొద్దీన్ పంచగామకు చెందిన సాయిలుకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే సంజీవరెడ్డి శుక్రవారం అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 6: సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన 60 మందికి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరు కాగా, సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్‌లు బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, నాయకులు డా. శ్రీహరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

- జహీరాబాద్: సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట వరమని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఝురాసంగం, జహీరాబాద్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఝురాసంగం మండలం సిద్దాపూర్‌కు చెందిన మొల్ల ముస్తాఫాకు రూ.46,500, ఎల్గొయికి చెందిన శారదకు రూ.34వేలు, పోట్‌పల్లికి చెందిన నర్సింహులుకు రూ.14,500, ఝురాసంగంకు చెందిన బస్సకు రూ.60వేలు, జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లికి చెందిన పర్వీన్‌కు రూ.39వేల చొప్పున ఎమ్మెల్యే మాణిక్‌రావు చెక్కులను అందజేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


జహీరాబాద్: శాంతినగర్‌లో నివాస పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

జహీరాబాద్, సెప్టెంబరు 6: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్రైడే- డ్రైడేలో భాగంగా శుక్రవారం పట్టణంలోని శాంతినగర్, హౌసింగ్‌బోర్డుతో పాటు ఇతర కాలనీల్లో పర్యటించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ కనీసం వారానికి ఒక్కరోజైనా ఇళ్లల్లో ఉండే పూలతొట్టిలు, నీటినిల్వ పాత్రలు, పరిసరాలు శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామనే విషయాన్ని అందరు గమనించాలన్నారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంధ్య, మున్సిపల్ సిబ్బంది రవీందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: డ్రైడే_ఫ్రైడ్ కార్యక్రమం పై శుక్రవారం నారాయణఖేడ్‌లో పురపాలక అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశావర్కర్లతో కలసి పట్టణంలోని 8వ వార్డులో ఇంటింటా పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గృహాల వద్ద పాతటైర్లు, కొబ్బరి బొండాల చిప్పలు, పాత డ్రమ్ముల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని వివరిస్తూ ప్రజలకు వివరించారు.

- చిలప్‌చెడ్: మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలో శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ.. మురికి నీటి నిల్వలను తొలగించారు. అదేవిధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయనవెంట ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి కార్యదర్శి యాదగిరి అంగన్‌వాడీ టీచర్ షైనాజ్‌బేగం, ఆశా వర్కర్ అనిత తదితరులు ఉన్నారు.

కష్టపడేవారికి కాంగ్రెస్‌లో గుర్తింపు

- డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి

నర్సాపూర్, సెప్టెంబరు 6: కాంగ్రెస్‌లో కష్టపడ్డ వారికి పదవులు కచ్చితంగా వస్తాయనడానికి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ నియామకమే నిదర్శనమని డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ నుంచి కాంగ్రెస్ కోసం నిరంతరం కష్టపడ్డ మహేష్‌కుమార్‌గౌడ్‌ను అధిష్టానం గుర్తించి పీసీసీ అధ్యక్షుడిగా నియమించడం గొప్పవిషయమన్నారు.

- శివ్వంపేట, సెప్టెంబర్ 6: తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా నూతనంగా నియమితులైన శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిని శివ్వంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.







వర్షం బాధలు ఇంతింత కాదయా!



నర్సాపూర్: విఘ్నేశ్వర కాలనీలో, సంతలో పారుతున్న వరదనీరు


కొండాపూర్: మల్కాపూర్‌లో కుప్పకూలిన ఇల్లు


నారాయణఖేడ్: రోడ్డుపై విరిగిపడిన చెట్టు

నర్సాపూర్, సెప్టెంబరు 6: నర్సాపూర్ పట్టణ పరిధిలోని 9వ వార్డు విఘ్నేశ్వర్ కాలనీవాసులకు భారీవర్షం పడినప్పుడల్లా తిప్పలు తప్పడం లేదు. శుక్రవారం మధ్యాహ్నం అరగంటపాటు కురిసిన భారీ వర్షానికి ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొన్నది. వివరాల్లోకి వెళ్తే.. నర్సాపూర్ బస్టాండు పరిధిలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న కుంటను అధికారులు, ప్రజాప్రతినిధులు గతంలో పట్టణ ప్రగతిలో భాగంగా పూడ్చివేసి అక్కడ పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే కుంటను పూడ్చే సమయంలో వరద నీరు పోయేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని చెప్పిన అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై పలుమార్లు ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు గానీ ఎవరూ పట్టించుకోలేదు. దీంతో కాలనీ వాసులకు పెద్దవర్షం వచ్చినపుడల్లా తిప్పలు తప్పడం లేదు. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా పెద్దవర్షం రావడంతో ఆర్టీసీ కుంట సమీపంలో ఉన్న విఘ్నేశ్వర కాలనీలోని నివాసాల మధ్య నుంచి పెద్ద ఎత్తున నీరు పారింది. దీంతో కాలనీవాసులు వరద నీరు తగ్గేంతవరకు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని విఘ్నేశ్వర కాలనీవాసులు కోరుతున్నారు. కాగా నర్సాపూర్‌లో శుక్రవారం సంత నిర్వహిస్తుండగా మధ్యాహ్నం వర్షం ఒక్కసారిగా దంచికొట్టడంతో కూరగాయల వ్యాపారులు, రైతులు ఆగమయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి అరగంట పాటు భారీవర్షం కురిసింది. కూరగాయల కుప్పలు వరదలో కొట్టుకుపోవడంతో వ్యాపారులు ఇక్కట్లకు గురయ్యారు.

దెబ్బతిన్న రోడ్లకు త్వరలో మరమ్మతులు: డీఈఈ

నర్సాపూర్ సబ్‌డివిజన్ పరిధిలోని ఆర్అండ్‌బీ రోడ్లు వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నట్లు డీఈఈ నాగరాజు తెలిపారు. శుక్రవారం డీఈఈ స్థానిక డీఈఈ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు నర్సాపూర్-తూకునూర్ రోడ్డులో బ్రాహ్మణపల్లి, అల్లీపూర్, లింగాపూర్ సమీపంలో కొంతమేర దెబ్బతిన్నదని అందుకు తాత్కాలిక మరమ్మతులకు రూ.లక్ష, ధర్మాసాగర్-మంగళ్‌పర్తి రోడ్డులో మరమ్మత్తుకు 5లక్షలు, ఘనపూర్-జోగిపేట రోడ్డుకు రూ.10లక్షల చొప్పున కేటాయించినట్టు వివరించారు.

- కొండాపూర్: మండల కేంద్రమైన కొండాపూర్, మల్కాపూర్‌లో భారీ వర్షాలకు శుక్రవారం రెండిళ్లు కూలిపోయాయి. మల్కాపూర్ గ్రామానికి చెందిన షాకేరా బేగం ఇల్లు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో ఇంట్లో సామగ్రి మొత్తం మట్టిలో పూడుకుపోయింది. మంగలి పద్మ ఇంటి పైకప్పు కూలి, వర్షపు నీటితో ఇల్లంతా నిండిపోయింది.
- నారాయణఖేడ్: నిజాంపేట - ఖేడ్ - బీదర్ 161బీ జాతీయ రహదారిపై నిజాంపేట మండలం ర్యాలమడుగు సమీపంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురియగా రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టు విరిగి రోడ్డుపై పడింది. అదే సమయంలో నిజాంపేట వైపు నుంచి ఖేడ్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు చివరన చెట్టు కొమ్మలు పడ్డాయి. ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. గ్రామస్థులు రోడ్డుపై నుంచి కొమ్మలను తొలగించడంతో రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.

చివరి దశకు దోస్త్ అడ్మిషన్లు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 6 : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా డిగ్రీ అడ్మిషన్ల కోసం ఈ నెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు.